# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

మంగళవారం, 13 ఆగస్టు 2024 | www.prajaaswaramdaily.com | 2 PM


# రేపు హైదరాబాద్‌కు రేవంత్ రెడ్డి

## నేటితో ముగియనున్న సీఎం విదేశీ పర్యటన



హైదరాబాద్, ఆగస్టు 13 (ప్రజాస్వరం): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన నేటితో ముగియనుంది. రేవంత్ రెడ్డి రేపు హైదరాబాద్ రానున్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అమెరికా నుంచి పలువురు పారిశ్రామికవేత్తలు, పరిశ్రమలను ఆకర్షించడంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతమైంది. ఇప్పుడు దక్షిణ కొరియాలో కొనసాగుతోంది. అమెరికా పర్యటన ముగించుకుని శనివారం కొరియా చేరుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత కొన్ని రోజులుగా విదేశీ పర్యటనలో బిజీబిజీగా గడుపుతున్నారు. అక్కడ జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సీఎం వివరించారు. సీఎంతో పాటు మంత్రి శ్రీధర్ బాబు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్ రెడ్డి ప్రస్తుతం దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఇప్పటికే గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో దక్షిణ కొరియా నుంచి పెట్టుబడులు రాబట్టుకున్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ప్రతినిధులు తెలిపారు. కొరియాలోని వివిధ కంపెనీలు మరియు వివిధ వ్యాపార మరియు వాణిజ్య సమూహాల ప్రతినిధులతో చర్చలు జరిగాయి. కొరియా టెక్స్‌టైల్ ఫెడరేషన్ చైర్మన్ క్యాక్ సంగ్, వైస్ చైర్మన్ సోయోంగ్ జూతో సహా 25 అగ్రశ్రేణి టెక్స్‌టైల్ కంపెనీల అధినేతలు రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ప్రముఖ ఆటోమోటివ్ కంపెనీ హ్యుందాయ్ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. మెగా పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. భారత్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ (హెచ్ఎంఐఈ) ద్వారా మెగా టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడులు పెడతామని కంపెనీ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డి బృందానికి తెలిపారు. ఈరోజు రేవంత్ టీమ్ ఫ్యూచర్ హ్యాంగంగ్ ప్రాజెక్ట్ హెడ్ క్వార్టర్స్ కు వెళ్లనుంది.





# గురుకుల హాస్టళ్లలో ఏసీబీ రైడ్స్

## తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హాస్టళ్లలో అధ్వానంగా పరిస్థితులు

### కుళ్లిపోయిన పదార్థాలతో భోజనం వండుతున్నారనే ఆరోపణలు

### మెట్‌పల్లి గురుకుల పాఠశాలలో తీవ్ర కడుపునొప్పితో విద్యార్థి మృతి

### హైదరాబాద్, నిజామాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లా, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో తనిఖీలు

హైదరాబాద్, ఆగస్టు 13 (ప్రజాస్వరం) : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఎస్సీ, మైనార్టీ, బీసీ హాస్టల్స్ లో తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. 33 జిల్లాల్లోని ఏసీబీ అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఏసీబీతో పాటు లీగల్ మెట్రాలాజీ, శానిటేషన్, ఫుడ్ ఇన్స్పెక్టర్, పే అండ్ అకౌంట్స్ శాఖల అధికారులు సోదాల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ హాస్టల్స్ లో ఎంత మంది విద్యార్థులు ఉంటున్నారు ? రికార్డుల్లో ఎంత మంది విద్యార్థుల వివరాలు ఉన్నాయి? ఆహార నాణ్యత, విద్యార్థులకు హాస్టల్స్ లో అందుతున్న సౌకర్యాలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. రికార్డులను పరిశీలించటంతో పాటు విద్యార్థులతోనూ ముఖాముఖి మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీసి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఈ తనిఖీలు నేటి సాయంత్రం వరకు కొనసాగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

#### ఆరోపణలపై స్పందన

ప్రభుత్వ హాస్టళ్లలో కుళ్లిపోయిన పదార్థాలతో భోజనం వండుతున్నారనే ఆరోపణలున్నాయి. అదేవిధంగా గత కొన్ని రోజులుగా హాస్టళ్లలోని విద్యార్థులు తరుచూ అస్వస్థతకు గురవుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లిలోని బాలుర గురుకుల పాఠశాలలో తీవ్ర కడుపునొప్పితో విద్యార్థి మృతి చెందిన విషయం కూడా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ హాస్టళ్లలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ లోని బీసీ, ఎస్సీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో మంగళవారం ఉదయం నుంచి అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. హాస్టళ్లలో ఆహారంతోపాటు సౌకర్యాలపై ఆకస్మిక సోదాలు నిర్వహిస్తున్నారు. కాగా, నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల బాలికల వసతి గృహంలో మంగళవారం ఉదయం నుంచి ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. హాస్టల్ లో విద్యార్థులకు అందజేస్తున్న ప్రభుత్వ ప్రయోజనాలను పరిశీలించారు. ప్రభుత్వ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించడం లేదన్న ఫిర్యాదులపై కొంతకాలంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఏసీబీ తనిఖీలు నిర్వహించారు. గురుకులాలు, హాస్టళ్లలో సోదాలు చేస్తున్న ఏసీబీ. మెస్, స్టూడెంట్స్ రిజిస్టర్ లను స్వాధీనం చేసుకున్నారు. రికార్డులన్నింటిని క్షుణ్ణంగా అధికారులు పరిశీలిస్తున్నారు. పలు హాస్టల్ స్టూడెంట్స్ రిజిస్టర్ లలో ఎక్కువమంది విద్యార్థులు ఉన్నట్టు వార్డెన్ లు నమోదు చేశారు. ఎక్కువ మంది ఉన్నట్టు చూపి అధిక మెస్ బిల్లులు తీసుకుంటున్నట్టు చేస్తున్నట్టు గుర్తించారు. కొంతమంది హాస్టల్ సిబ్బందిని అదుపులోకి తిసుకుని విచారిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా డీఎస్పీ ఉదయ రెడ్డి ఆధ్వర్యంలో ఏసీబీ తనిఖీలు నిర్వహించారు. సిరిసిల్ల పట్టణం పెద్దూర్ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల లో ఏసీబీ అధికారుల ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పలు రికార్డులను పరిశీలిస్తున్నారు. తనిఖీల్లో భాగంగా ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు.. ర్యాండం సిస్టంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా దాడులు చేపట్టారు. హాస్టల్లో వసతులు ఎలా ఉన్నాయని అధ్యయనం చేస్తున్నారు.

#### సాయంత్రం వరకు కొనసాగింపు

ఈ తనిఖీలపై ఏసీబీ అధికారులు స్పందిస్తూ గురుకులాల్లోనూ తనిఖీలు కొనసాగిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా చూపిస్తున్నారన్నారు. కానీ లెక్కలు చూస్తే చాలా తేడాలున్నాయని చెప్పారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం ఇవ్వటం లేదనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. టాయిలెట్లు కూడా శుభ్రం లేవని.. చాలా దుర్గంధంగా మారాయిని అన్నారు. చాలా హాస్టళ్లలో వాటల్ లీకేజీలు ఉన్నాయని.. విద్యార్థుల స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. కాగా, ఈ తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలు సాయంత్రానికి వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్త తనిఖీల తర్వాత వివరాలు వెల్లడి కానున్నాయి.

### ఏసీబీ వలలో రంగారెడ్డి జిల్లా

# అడిషనల్ కలెక్టర్

### ధరణి వెబ్ సైట్‌లో ప్రొహిబిటెడ్ లిస్ట్ నుంచి భూమిని తొలగించడానికి..

### వ్యక్తి నుంచి రూ. 8 లక్షల లంచం డిమాండ్

### రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

హైదరాబాద్, ఆగస్టు 13 (ప్రజాస్వరం) : ఉన్నత హోదాలో కొనసాగుతూ ఆదర్శంగా ఉండాల్సిన కొందరు ప్రభుత్వ అధికారులు అడ్డదారులు తొక్కుతున్నారు. లంచం తీసుకోవటం నేరమని తెలిసినా.. డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. చిన్నాచితక ఉద్యోగులే కాదు..పై స్థాయి ఉద్యోగులు సైతం లంచాలకు మరుగుతున్నారు. తాజాగా.. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటం కలకలం రేపుతోంది. గత రాత్రి 11 గంటల సమయంలో ఓ వ్యక్తి నుంచి రూ.8 లక్షల లంచం తీసుకుంటూ అడిషనల్ కలెక్టర్ భూపాల్ రెడ్డి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు సమీపంలో డబ్బులు కారులో పెట్టుకుంటుండగా.. ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. వివరాల్లోకి వెళితే.. జక్కిడి ముత్యంరెడ్డి అనే వ్యక్తి తనకున్న 14 గుంటల భూమిని ధరణి వెబ్ సైట్‌లో ప్రొహిబిటెడ్ లిస్ట్ నుండి తొలగించాలని దరఖాస్తు పెట్టుకున్నాడు. అయితే అందుకు సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్ రెడ్డి రూ. 8 లక్షలు డిమాండ్ చేశాడు. దీంతో ముత్యంరెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ముత్యంరెడ్డి నుంచి సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్ రెడ్డి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలవేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



### 45 ఏళ్ల పొలిటికల్ కెరీర్‌లో

# ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా

#### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, ఆగస్టు 13 (ప్రజాస్వరం) : తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యల పట్ల ఆయన ఆవేదన చెందుతూ.. ఇవాళ ఆయన ఖమ్మంలో మీడియాతో మాట్లాడారు. ఆ భద్రాచల రాముడు, ప్రజల దయతోనే తాను ఇన్నేళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని తెలిపారు. ఎన్టీఆర్ కాలం నుంచి మంత్రిగా ఉంటూ జిల్లాకు మేలు చేసేందుకే ప్రయత్నించానని అన్నారు. ఖమ్మం జిల్లా నుంచే గోదావరి పారుతున్నా.. ఆ జలాలు ఈ నేలను తడుపలేదన్నారు. మొదటి నంచి జిల్లాలో మొత్తం భూమికి నీళ్లు ఇవ్వాలన్నదే తన సంకల్పమని పేర్కొన్నారు. మంత్రిగా ఉన్న ప్రతిసారి ముఖ్యమంత్రులతో మాట్లాడి తన ప్రయత్నాలు తాను చేశానని గుర్తు చేశారు. సత్తుపల్లి, జూలూరుపాడు, వేలేరు ప్రాంతాలకు కూడా నీళ్లు ఇవ్వాలంటూ ప్రాధేయపడిన సంఘటన కూడా ఉన్నాయని తెలిపారు.

#### ఖమ్మం జిల్లాకు నీళ్ల కోసమే పార్టీ మారాను

ఖమ్మం జిల్లా రైతాంగాన్ని దృష్టిలో పెటుకుని నీళ్ల కోసం గతంలో పార్టీ మారానని క్లారిటీ ఇచ్చారు. కానీ, గత ప్రభుత్వం జిల్లాలో తలపెట్టిన ప్రాజెక్టుల పనులను పట్టించుకోలేదని ఆరోపించారు. రాహుల్ గాంధీ కోరిక మేరకు మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరానని గుర్తు చేశారు. కాంగ్రెస్‌లోకి వచ్చేటప్పుడు కూడా ప్రాజెక్టులు పూర్తి చేయాలంటూ అధిష్టానానికి తెలిపానని అన్నారు. అనంతరం మంత్రి కాగానే సత్తుపల్లి టన్నెల్ పనులు ప్రారంభించానని అన్నారు. సీతారామ ప్రాజెక్ట్ విషయంలో క్రెడిట్ కోసం తాను ప్రయత్నిస్తున్నాని హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు తనను ఎంతగానో బాధించాయంటూ ఎమోషనల్ అయ్యారు. తాను క్రెడిట్ కోసం




తాపత్రయ పడే వ్యక్తి కాదని మంత్రి తుమ్మల బదులిచ్చారు. అంతిమంగా జిల్లాకు నీరివ్వాలన్నాదే తన లక్ష్యమని, కీర్తి, ప్రతిష్టల కోసం ఆరాటపడే మనిషిని కాదంటూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.

# ఎల్లుండే మూడో విడత రుణమాఫీ

### రూ.2 లక్షల వరకు మాఫీ చేయడానికి రంగం సిద్ధం

### రూ.31 వేల కోట్ల రుణమాఫీ.. దేశంలోనే తెలంగాణ కొత్త రికార్డు

హైదరాబాద్, ఆగస్టు 13 (ప్రజాస్వరం) : రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మూడో విడత రుణమాఫీపై తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు చేసింది. ఆగస్టు 15 నాటికి రూ.2 లక్షల వరకు రైతుల రుణాలు మాఫీ చేస్తామన్న తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. ఆగస్ట్ 15లోగా రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అంతకు నెల రోజుల ముందే ఈ పథకాన్ని అమలు చేసి చూపించారు. 32.50 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసేందుకు రూ.31 వేల కోట్ల రుణమాఫీకి ప్రభుత్వం నిధులు కేటాయించి దేశంలోనే కొత్త రికార్డు నెలకొల్పింది. జులై 15వ తేదీన రుణమాఫీ జీవో జారీ చేసిన ప్రభుత్వం.. మూడు రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయటం మొదలు పెట్టింది. జులై 18వ తేదీన మొదటి విడతగా లక్ష రూపాయల స్లాబ్ వరకు రుణమున్న రైతు కుటుంబాలన్నింటికీ ఏకకాలంలో రుణమాఫీ చేసింది. 11,14,412 మంది రైతులకు రూ.6034.97 కోట్లు విడుదల చేసింది. జులై 30వ తేదీన అసెంబ్లీ వేదికగా రెండో విడత రుణమాఫీ




కార్యక్రమం అమలు చేసింది. ఒక లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు రుణమున్న రైతు కుటుంబాలను రుణ విముక్తులను చేసింది. దాదాపు 6,40,823 మంది రైతుల ఖాతాల్లో రూ.6190.01 కోట్లు జమ చేసింది.

కేవలం 12 రోజుల్లోనే దాదాపు 17.55 లక్షల రైతుల కుటుంబాలకు రూ.12 వేల కోట్లకుపైగా రుణమాఫీ నిధులు జమ చేయటం తెలంగాణ చరిత్రలో ఇదే మొదటిసారి. ఆగస్ట్ 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మూడో విడత పంట రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. అమెరికా పర్యటన నుంచి వచ్చీ రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా వైరా మండలంలో ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. మూడో విడతలో రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఉన్న పంట రుణాలు మాఫీ చేస్తారు. ఆ రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తారు. దీంతో రుణమాఫీలో కీలక ఘట్టం ముగియనుంది. రూ.2 లక్షలకు మించి పంట రుణాలున్న రైతులకు చివరి విడతగా నిధులు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రుణమాఫీ విధి విధానాల్లో ఈ విషయాన్ని ముందుగానే వెల్లడించింది.